

# దొరికిన దొంగ

శశాంక చంద్ర

బస్సు దిగి సంచిని కుడిచేతిలోనికి మార్చుకుంటూ చుట్టూ చూశాను. లారీలు, బస్సుల చప్పుళ్ళతో చెవులు గింగురుమంటున్నయ్. ఏదో రైలు వచ్చినట్టుంది. రిక్షాల, సైకిళ్ల గణ గణ లెక్కువయినయ్. వీటన్నిటికి తోడు బిస్కట్లు సోడాలవాళ్ల అరపులు .... బళ్లమీద, కొట్లలోను ఉన్న మిఠాయి సరుకుకు సందులేకుండా మూగిన ఈగల సంగీతం ......

మధ్యాహ్నం పన్నెండింటికి 'అమరావతిలో' బస్సు ఎక్కితే 'గుంటూరు' లో కాసేపు ఆగినా తెనాలిలో యిప్పుడు దిగటం అయింది. ఒళ్ళు విరుచుకుని పళ్ల దుకాణం దగ్గరికి నడిచాను. రెండు అరటిపళ్ళు కొన్నాను. ఆకలిగా ఉన్నానేమో ఒక పరిడు తినేశాను. రెండవది తింటుండగా 'నాకు కొంచెం పెట్టండి' అన్న మాటలు విని పక్కకు చూశా. ఒకతను చేయి చాపి నిలబడ్డాడు అతనిని పూర్తిగా చూడకుండానే "ఎంగిలిచేశానోయి" అన్నా. "ఫరవాలేదు. నాకు ఎంగిలిఅంటే భలే యిష్టం. మా చిట్టి ఎంగిలిచేసిపెడుతుంటుంది. బలే బాగుంటాయి" అని లొట్ట లేశాడు. ఇంతలో కొట్టువాడు పళ్లకత్తి తీసుకుని "నువ్వెక్కడ దొరికావురా సైతానుగాడా ! కొట్టు కొచ్చే వాళ్లను గూడా రానివ్వకుండా .... ముందర యిక్కడనుంచి పోతావా పోవా ?" అంటూ కత్తి చూపించి గుడ్లురిమాడు. అతను భయంగా అడుగులు వెనక్కు వేశాడు. ఇంతలో కిందవున్న అరటి పండు తొక్కు మీదకి అతడి చూపు పోయింది. గబుక్కున తీసుకొని గిరుకు, తినసాగాడు. అతని చేష్టలకు అసహ్యము, జాలి వేసినయ్. ఒక డజను పళ్ళు కొని, సంచీలో పెట్టుకొని, అతనికి ఒక టప్పమని చెప్పి, డబ్బులు యిచ్చి వంతెన మీదికి నడిచాను. ఎందుకో వెనక్కు తిరిగాను. అతను నల్లబడిన అరటిపండు ఒకటి తింటూ గంతులు వేస్తున్నాడు. కొట్టువాడిమీద కోపం వచ్చి కేకలు వేద్దా మనుకొని కూడా ముందుకే సాగాను.

రిక్షా ఎక్క బుద్ధికాలేదు వంతెన కిందికి జల జలా కళ్ళు తిరిగే వేగంతో నీళ్ళు పరుగులెత్తు తున్నయ్. దూరంగా, మసకగా కన్పిస్తున్న బ్రిడ్జి మీద రైలు నల్లత్రాచులా బుసలు కొడుతూ పరుగెత్తింది. సాయంకాలం కావటంవల్ల చల్లని గాలి మెల్లిగా సాగింది. పెద్ద బజారు గోలకి భయపడి కాలవల మధ్యగా పాత వంతెన దిగి కొత్త వంతెన చేరుకొన్నాను. కొత్త వంతెన దిగి నిల బడ్డా. వంతెన మీదకు పోతున్న వాహనాలు రెండవ వైపుకు మాయమైనా శబ్దం వినిపిస్తూనే ఉంది.

అదిగో పులి అంటే ఇదిగో తోక - లోకంలో రివాజు ఇది. 'దొంగ' అనగానే పట్టుకొని కుళ్ళ బొడిచేశారు.

అంతేకాని ...

మొక్కజొన్న కండెతోను, బటాణీ గింజలతోను సరి పెట్టుకొని దెబ్బలు తినే దొంగలుంటారా అన్న ఆలోచన అయినా కలగలేదు ఆ జనానికి.

అది వాళ్ళ తప్పుకాదు. వాళ్లకు చేతనైనది చేశారు.

ఇంతకూ నిజమైన దొంగల్ని పట్టుకొనడం చేత కావద్దూ?

# దొరికిన దొంగ

చప్పుడు చేస్తూ ప్రత్యక్షమౌతున్న బళ్ళు వేగంగా ముందుకు జారుతున్నాయి. తన నాల్గు ఝాముల అనుభవాన్ని అభివర్ణించటానికి సూర్యభగవానుడు ఆకాశంలో వసంతం వెదజల్లి, విషాద కషాయిత వదనుడై పశ్చిమాద్రిలో ప్రవేశించాడు.

పక్కన హోటల్లో ఒక కప్పు కాఫీ త్రాగి బయటపడ్డా. అడ్డదోవన ఒక సినిమా చేరు కొన్నా. ఆ టాకీసువద్ద జనం విపరీతంగా ఉన్నారు. ఆ క్రిందటి రోజే ఏదో క్రొత్త సినిమా వచ్చింది, గావాల్ను. అర ఫర్లాంగులెక్క 'క్యూ'లు ఉన్నాయి. బుకింగ్ దగ్గ జనం పెనుగులాడుతూనే ఉన్నారు. టిక్కెట్లివ్వబోతున్నట్లు గంట మోగింది. దాంతో జనంలో తొక్కిసలాట విపరీతమయింది. 'క్యూ' లో నిలబడ్డవాళ్ళు కూడా బుకింగ్ దగ్గరకు పరు గెత్తారు. కొంతమంది పోలీసుల లాఠీ దెబ్బలు లెక్కచేయకుండా గోడలెక్కి అతి సాహసంగా 'క్యూ' లో దూకుతున్నారు. ఒక పోలీసు బెల్టు విప్పి బాత్తున్నాడు. కొంతసేపటికి యీ దెబ్బలు పడలేక పరుగెత్తి 'క్యూ' లో వెనకాల నిలబడ్డారు. 'ఈ గోలలోకి ఎందుకు వచ్చానురా !' అనిపించింది. ఎవరో భుజంమీద చెయ్యి వేశారు.

"ఏరా రమణా ! ఎంతసేపయింది వచ్చి" అడి గాడు పక్కనే నిలబడ్డ మూర్తి.

"ఇప్పుడేరా".

"మనవాళ్లంతా కులాసా ? సెలవుల్లో వూరికినే కూర్చోవట మెందుకని 'గుంటూరు అమరావతి' చక్ర గొట్టొచ్చాలే !"

"ఆహా ! నిక్షేపంలా ఉన్నారు. ఎనిమిది లంక ణాలు చేసి నిన్ననే పత్యం తీసుకొంది పిన్ని. రాత్రి మంచి బాబాయి తల నెప్పని అన్నం మానేసి ముసుగు పెట్టాడు. 'వేణి' భారం భరించలేక గోడలు, స్తంభాలు ఖరాబు చేస్తూంది. 'బుజ్జిగాడు' సైకిలు నేర్చుకుంటూ రూపాయి బిళ్లంత గాయం చేసు కొని పదిరూపాయలు ఖర్చు పెట్టించాడు. జీత గాడు గవదబిళ్లలు లేచినయ్యని రెండు రోజులు సెలవు పెట్టాడు ....."

"ఇంకా బాగుం దెవరూ? దోడ్లో రుబ్బరోలు, గుళ్లో లింగమూనూ ?" అని పెద్దగా నవ్వాడు.

"అబ్బే రంగడు లేడు వాడూ బాగానే ఉన్నాడు. రిజల్ట్సు దగ్గరకు వస్తున్నయ్యని సాంబశివుడికి కొట్టే కొబ్బరికాయలసంఖ్య రోజు కొకటి పెంచుతూ ఆంజనేయ దండకం బట్టీ చేస్తు న్నాడు." నా చివరి మాటలు రహస్యంగా మాట్లాడి నట్లు బయటపడ్డయ్. మూర్తి విరగబడి నవ్వాడు.

"ఆ గొంతేమిటి అట్లా మారింది. గుంటూరు పాతాళగంగ అంత ఘాటుగా ఉందా !"

"అబ్బే యిది అమరావతి క్రిష్ణవేణి మహత్మ్యం". యిద్దరం నవ్వుకున్నాం.

"సినిమాకు వచ్చావా" అని అడిగాను.

"సినిమాకా ! యివ్వాళేనా ! చూశావుగా ? టిక్కట్ల కోసం కూనీ కావటానికైనా సిద్ధంగా ఉన్నారు, మన ప్రేక్షక మహాశయులు. సరే నేను బజారు పోతున్నా గాని నువ్వు యింటికి వెళ్ళ యిక్కడ అప్పుడప్పుడు చిన్నసైజు కోట్లాటలు సాగుతుంటై" అని వెళ్ళాడు.

'టీ' 'కాఫీ' అంటూ గిన్నెమీద గరిటెతో గబ గబ కొడుతున్నాడు ఒకతను. చౌకబారు హోటలు సరుకులు తింటూ బల్లలమీద కూర్చున్నారు జనం. 'టీ' 'కాఫీ' లు బారలుచాపి తిరగబోస్తున్నారు సర్వర్లు. మరోవైపు ముంత మసాలా వేరుసెన క్కాయలు బళ్లమీద ఉన్నాయి. కొందరు పగిలి పోయిన కుండల్లో నిప్పులు పోసి మొక్కజొన్న కండెలు కాలుస్తున్నారు. ఎర్రని పండు నిప్పుల్లో దోరగా వేగిన కండెలు చూడగానే కొని పెట్ట మంటూ నోట్లో నీళ్ళు తెగ వూరసాగినై. కాని ఎవరన్నా ఎరిగినవాళ్ళు చూస్తే ఉన్న పరువు కాస్త హరించిపోతుందేమోనని పీకులాట. అయినా ఎవరూ చూడకుండా ఒకటి కొని జేబులో పెట్టు కుని ఒక్కొక్కటి గిల్లుకు తిందామని అటూ యిటూ చూచి దగ్గరికి నడిచా.

ఇంతలో ఒక చిన్నపిల్ల అక్కడికి వచ్చింది. అయిదా రేళ్ళుంటాయి. ఉతికిన చుక్కల గౌను తొడు క్కుంది. మెళ్లో తెల్లని పూసల దండ మెరు స్తున్నది. జడలో ఒక ఎర్రని ప్లాస్టిక్ పువ్వు గుచ్చుకున్నది. ఏ గుళ్లో పెట్టుకున్నదో ఏమో పెద్ద కుంకంబొట్టు ఒక పక్కకి చెరిగినది. చెవులకు చిన్న లోలకు లున్నాయి. అటూ ఇటూ చూస్తున్నప్పుడు లైట్ల కాంతికి కళ్ళు తళుక్కు మంటున్నయి. గబగబా వచ్చి నా ముందు నిల బడింది. యిక్కడ కూడా 'క్యూ' ఎందుకులే అని పక్కన ఉన్న బెంచీమీద కూర్చున్నా.

"అమ్మాయి యిదెంతా ?" ఒక కండెను చూపిస్తూ అడిగిందామ్మాయి.

"మూడు కానులు" అన్న దామ్మె విసినికర్రతో విసురుతూ.

"అర్ధనాకియ్యవూ" అడిగింది.

"అర్ధనాకా ... అది." చిన్నసైజు చూపించింది. ఆ పిల్ల మూడు పైసలు ఆమె చేతికిచ్చి పచ్చి దొకటి తీసికొని కాల్చమంది. ఆపిల్ల చురుకుదనం చూసి ఉండబట్టలేక అన్నాను. "పెద్దది తీసికో పాపా—". నన్ను ఎగాదిగా చూసింది.

"నా కొద్దండీ."

"ఏం ?"

"పెద్దది తీసికొంటే జబ్బు చేస్తుందని మా మామయ్యకి సగం యిస్తాడు తాతయ్య. మామ య్యకి నే నెందు కివ్వాలి ? పొద్దు నెక్కడో అట్టి పండు తెచ్చుకొని నాకు కొంచెం కూడా పెట్ట కుండా తిన్నాడు గానీ" ఆ పాప చెబుతున్నపుడు ముఖ భంగిమ మార్చటం, కళ్ళు గబగబా ఆడిం చటం, మూతి బిగించటం ... ముచ్చటేసింది. ఇక ఆ మామయ్య ఎట్లా ఉంటాడో అనుకున్నా. ఇంకాసేపు మాట్లాడా లనిపించి "మీ మామయ్య మంచివాడేనా పాపా."

"హో ! భలే మంచివాడు. ఏం తెచ్చుకున్నా నాక్కూడా పెడతాడు. మొన్న నన్ను ఉప్పెక్కించు కొని బావిమీద యిటూ, అటూ దూకుతుంటే, మా పెద్ద మామయ్య కర్ర తీసుకొని కొట్టాడు. అప్పుడు పెద్దగా మామయ్య ఏడ్చాడు" అని బిక్కమొహం పెట్టింది.

"మ అట్లా బావిమీద దూకితే నువ్వు పడవూ ?అందుకని మీ పెద్ద మామయ్య కొట్టాడు" అన్నా. ఆ నిమషంలో నామీద కూడా విరక్తి పుట్టి నట్లు చూసింది.

"మే మెందుకు పడతాము. మా చిన్నత్తయ్య గారింట్లో ఉన్నాడే పాపాయి ఉయ్యాలలో నిద్ర పోతాడు .... అంత పాపాయిలమా ? బావెక్కి అందులో పట్టానికి." నాకు నవ్వాగక పెద్దగా నవ్వాను. పాప కూడా నవ్వింది.

"మీ మామయ్య కెన్నేళ్ళుంటయి."

"అబ్బో చాలా వుంటై .... తొంబై ఏళ్ళు." అర్థంకాక బుర్ర గోక్కున్నాను. "మీ మామయ్య ముసలివాడా ?" పాప చప్పరించింది.

"ముసలాడు మామయ్య కాదు. తాతయ్య"

"బాగా పరుగెత్తుతాడా?" ఎందు కడిగానో నాకే తెలియదు.

"ఓ ! మొన్న పండగనాడు గాల్లు చేసు కొన్నాం. మామయ్య చెప్పకుండా బోలెడన్ని గాల్లు జేబులో పెట్టుకొని సూరయ్యగారి దొడ్లో

కూరని తింటున్నాడు. అప్పుడు సూరయ్యగారు కర్ర తీసుకొని కొట్టబోతే పారిపోయాడు. వాళ్ల యిల్లెక్కి దీపస్తంబం పట్టుకొని దిగిపోయాడు." ఆ దృశ్యం వూహించుకున్న నాకు ఒళ్లు జలదరించింది.

"సూరయ్య కొట్టడ మెందుకు ?"

"మరి వాళ్ల దొడ్లో తింటున్నాడు గదూ .... అందుకని" అన్నది.

ఏమి తెలియని అజ్ఞానములో వున్నా స్వచ్ఛమైన మాటలు కురిపిస్తున్న పాప భుజంమీద చేయివేసి "నీ పేరేమిటి పాపా" అన్నాను.

"నా పేరా ! అమ్మేమో 'బుజ్జి' అని, 'బంగార' మని పిలుస్తుంది. తాతయ్య, అమ్మమ్మ 'అమ్మలు' అని పిలుస్తారు. పెద్ద మామయ్యేమో 'బుల్లాం' అని పిలుస్తాడు. అందరు 'పాపా' అని పిలుస్తారు" అంది పాప.

"మరి మీ నాన్నో."

"మా నాన్న లేడుగా, చచ్చిపోయాడు" నిర్లిప్తంగా అంది పాప. నాకు మట్టుకు మనసులో కలుక్కుమంది. "ఎప్పుడు పోయాడు ?" ఈ వివరాలన్నీ నీ కెందుకు అన్నట్లు పెద్ద కళ్లను పూర్తిగా విప్పి నా వంక చూసింది. "ఏమో నాకు తెలీదు" అన్నది. యింతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు అన్నది. "మరి సాయంత్రమే అమ్మ కళ్లు మూసుకు పడుకుంటే నేను కుంకం తీచుకువెళ్లి అమ్మ మొఖంమీద బొట్టుపెట్టాను. తరువాత అమ్మ లేచి 'బొట్టు పెట్టద్దని నీ కెన్నిమాట్లు చెప్పాను' అని పట్టుకో బోయింది. నేను చిక్కకుండా పరిగెత్తి 'ఛీతాం' గారింటో దాక్కున్నా" అని పకపకా నవ్వింది. నేనూ చిన్నగా నవ్వాను. ఉన్నట్టుండి "అరే ! నే నిచ్చిన కండె కాల్చలేదేమ్మాయ్" అంది.

"నువ్వు మాట్లాడుతున్నావుగా" అని పాప పిరిసెచ్చి కండెను నిప్పుల్లో పడేసింది.

"అందుకే మాట్లాడనులే. తొందరగా కాల్చు." దానివంకే చూస్తూ కూచుంది. నేను మళ్లీ పిలిచాను. నిప్పుల వంక చూస్తూనే యిష్టం లేనట్లు "వూ" అన్నది. "మరి మీ మామయ్య గోల చేస్తుంటే మీ వాళ్లు కోప్పడరు ?" తల వూపింది. "కొత్తారు. నిన్న కొడితేను మామయ్య పారిపోయాడు. రమ్మంటే రాకుండా కాలవలో పడి చత్తాన్నాడు"

"కండె కాలింది పాపా" అన్న దామె తీసియిస్తూ.

"ఇంక బాగా కాల్చవూ" అన్నది ఎర్రగా కాలిన కండెను చూసి.

"ఎబ్బే, యింకా కాలితే మాడిపోతుందమ్మా. అట్లాగే బాగుంటుంది" అన్న దామె.

"అయితే సరే" అని దానిని ఒళ్లో పడేసుకుని రెండు చేతులతో నలిపి చల్లార్చుకొంది.

టాకీసులోంచి బెల్ వినిపించింది. పోలీసుల ధాటికి ఆగలేక వరసగా నడుస్తున్న జనం బెల్ వినబడటంతో ఆట మొదలు పెడుతున్నారని తోసుకో నారంభించారు. మళ్లీ గుంపులో పోలీసుల బెల్టులు వీర విహారం చేసినై.

పాప వెళ్లటానికి లేచి కొన్ని గింజలు నోటితో కొరుక్కొని నములుతూ మెరుస్తున్న కళ్లను నలువైపులా తిప్పుతూ ముందుకు ఆనందంగా పరుగెత్తింది.

వల్లెలవైపు, కాలవల వైపు కనిపించే ప్రకృతి సౌందర్యం, ఉద్యానవనాల్లో సొగసు, ఆకాశ హర్మ్యాలలో ఆనందం ఏమిటో గాని చిలక పలుకులు విరజిమ్మిన చిన్నారి పాప చిలిపి కళ్లలో చిలికిన కాంతులు, చలించని చిత్రమై మెదడులో నాటుకొన్నది.

వామోషీకి స్థాన మిక్కడ ఒక కండెను కొని లేచి నిలబడ్డాను. నాలుగు గింజలు వలిచి తినబోయి చూచాను. సంతోషంగా పోతున్న పాప దగ్గిరికి ఒకతను గబగబా వచ్చి, కండెను వూడలాక్కొని పరుగెత్తాడు. పెద్దగా అరిచి ఏడ్వ సాగింది పాప. ఎవరో 'దొంగ దొంగ పట్టుకోండి' అని కేక లేశారు. మరు క్షణంలో దొంగ అనే మాట కారుచిచ్చులా జనంలో వ్యాపించింది. డబ్బు దగ్గరున్నవాళ్లు జేబులు నొక్కి పట్టుకున్నారు. కొందరు పక్కనున్న టీ స్టాల్సులోకి పరుగెత్తారు. ముసలమ్మలు రాళ్లు రువ్వుతారనే భయంతో తమ పిల్లలను జాగ్రత్త చేసికొంటున్నారు. కొందరు హడావిడిగా తల గుడ్డలు బిగించి అటు ఇటూ పరిగెత్తారు. క్షణంలో ఆ ప్రాంతం అంతా అలజడితో ఉడికిపోయింది.

కొంతసేపటికి అతనిని పట్టుకొన్నారు. జుట్టు పట్టుకుని ఈడ్చుకొస్తున్నారు. అతను పెద్ద పెట్టున ఏడుస్తూ పారిపోవాలని వ్యర్థ ప్రయత్నం విపరీతంగా చేస్తున్నాడు. అతనికి సుమారు పాతికేళ్లుంటాయి. అతుకులు పడిన చొక్కా చినిగి మాసిపోయింది. తొడల వరకు ఉన్న నిక్కరు చీలికలై పీలికలు వేళ్లాడుతున్నై. కళ్లు లోతుకు పీక్కుపోయి తేజో విహీనంగా జాలికి స్థానమైనై.

"కొట్టండి, తన్నండి" అంటూ వీపుమీద, తలమీద, డొక్కలో అందిన చోటల్లా పిడికిళ్లతో పొడుస్తున్నారు. ఒక్కొక్క పోటుకు గిలగిల్లాడిపోతున్నాడు.

"ఏం దున్నపోతల్లే ఉన్నాడు దొంగతనం చేయకపోతే పని చేసికోలేడూ" అన్నా డొకాయన.

"అందులో చిన్నపిల్ల దగ్గిరా" అన్నది మరో కంఠం.

"ఇటువంటి పనులు చేయకుండా చితక పొడవండి" అన్న దొక కరుకు కంఠం.

"పాపం ఏడుస్తుంటే అట్లా కొట్టటం ఎందుకు, అర్ధనా కండె కోసమని ......" అంటున్న ఒకాయన వంక చురచురా చూశాడు మరొకాయన.

"మీకు తెలియదులెండి, యిటువంటి వాళ్లను వదలకూడదు" అన్నారు అనుభవజ్ఞుడల్లే.

వీళ్ల వాదోపవాదాల మధ్య వెలిశాడు ఒక బుర్ర మీసాల భయంకరాకారుడు. అందరినీ నెట్టుకుంటూ ముందర కొచ్చాడు.

"ఏం రా అబ్బీ! చిన్నపిల్లల దగ్గరరా నీ దొంగతనం" అన్నా డా మీసాల వ్యక్తి. వెంటనే అతని బండచేతి అయిదు వేళ్లు అతని చెంపమీద ఎర్రగా ముద్రించినై. అతనికి తెలివి తప్పింది.

"కాసిని నీళ్లు పట్రండిరా" అన్నా డావ్యక్తి. ఒక గ్లాసులో సిద్ధమైన నీళ్లు అతనిమొహాన చల్లారు. అతను కళ్లు మెల్లిగా తెరిచాడు.

"ఇంకా ఎక్కడ దొంగిలించావు ? చెప్పు." అడిగా డా వ్యక్తి.

ఆ వేకిని పరిశీలనగా చూశాను. చాలా


# గ్లోరియా

మీ ముఖానికి కాంతిని, లేతదనాన్ని, అందాన్ని తెచ్చును
అన్ని షాపులలోను దొరకును



జనితా ప్రొడక్ట్సు, ఏలూరు, ఆంధ్ర

## హోమ్ సినీ ప్రొజెక్టర్ 15రు/లకే



అద్భుతమైన గృహవినోద సాధనము కల్పన, సాహసము, అద్భుతములగల సన్నివేశము లెన్నో యీ ప్రొజెక్టరుతో మీ యింటియందే చూడండి. ఇది టార్చితో లేక ఎసి/డిసి ఎలెక్ట్రిసిటితో పనిచేయును. ఉపయోగించదగు ఫిల్ము 35 ఎం.ఎం. బొమ్మలు తెరపై సజీవముగా పలురంగులలో నటించును. మీకు ఆశ్చర్యము కలుగును అనేకులు ఆకర్షింపబడుదురు. ధర రు 15/- 40 అ॥ ఫిలిం 4' X 3' సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టి ఉచితం. పోస్టేజి రు 4-50 అదనం. డీలక్స్ స్పెషల్ ప్రొజెక్టర్ ధర రు 25/ 60 అ॥ ఫిలిం & 4' X '3 సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టి ఉచితం. పోస్టేజి రు 5 అదనం. అందరు కోరుచున్నారు! నేడే ఆర్డరు పంపండి.

HOLLYWOOD CINEMA CORP (Regd)
2194 Kalyanpura, Turkman Gate (12
DELHI-6.

*Tel: SOUND* *Phone No 120*

స్త్రీలపాలిటి కామధేనువు

## "డిస్మెనూర్"

(రిజిష్టర్డు)

(ఋతుశూలహారి)

వేలకొలది స్త్రీలు "డిస్మెనూర్" వాడి గంటునొప్పి బాధనుండి నివారింపబడిరి గంటునొప్పి బాధను గ్యారంటీగా పోగొట్టును. వెల రు. 4-0-0

### డాక్టర్ సి. మల్లిక్స్ ఫార్మసీ

విశాఖపట్నం

డిస్ట్రిబ్యూటర్సు :

వైజాగ్ రేడియో కో., విశాఖపట్నం-1.






# దొరికిన దొంగ

లావుగా ఉన్నాడు. నల్లటి ముఖము, ఎఱ్ఱబారిన కళ్లు. కట్ బనియన్ తొడగటంవల్ల అతని ఛాతీ పొంగి ఉన్నది.

“చెప్పవేం?” ఆ వ్యక్తి కంఠం పిడుగులా పలికింది.

“ఎక్కడా చెయ్యలేదు” అని మళ్లీ ఏడుపు మొదలుపెట్టాడు

“అరె ఏడుస్తా వెందుకురా?” ఆ వ్యక్తి ముష్టి ఘాతం అతని డొక్కలో తగిలింది. అతను మెలి కలు తిరిగిపోయినాడు. అతన్ని లాక్కొచ్చి స్తంభా నికి కట్టివేశారు.

“జేబులు వెతకండి.” జనంలో ఎవరో అన్నారు. అతను వెతకనివ్వలేదు. తన సొమ్మును ఎవరో తింటానికి వస్తున్నట్లు జేబు నొక్కి పట్టు కున్నాడు.

“జేబు చూపించమంటే అట్టా గింజుకుంటా వేంటిరా” అని ఒకతను అతని జుట్టు పట్టుకొని స్తంభానికి గబగబా బాదాడు. అతని నోటి వెంట రక్తం వచ్చింది.

అంతసేపూ నిశ్చేష్టుడనై చూస్తున్న నా గుండెల్లో సమ్మెటలు గబగబ మోగినై. జనాన్ని తోసుకొంటూ ముందుకు వచ్చాను.

“ఎందుకయ్యా అలా కొడతారు. అతను దొంగనుకుంటే పోలీసుల కప్పజెప్పాలి కాని యిష్టం వచ్చినట్లు కొట్టడం మీ యిష్టమే అనుకొన్నారా” అన్నాను తీవ్రంగా.

“పెద్ద చెప్పొచ్చావు లేవయ్యా, స్టేషనులో పెడితే రేపు ప్రొద్దునకల్లా వదిలేస్తారు మెత్తగా దంచితేనే గాని మళ్లీ చెయ్యకుండా ఉండడు. ఇటువంటి దొంగలను వదలచ్చా ?” అన్నాడు మీసాల వ్యక్తి.

నాకు కోపం వచ్చింది. “ ఆ అధికారం నీ కెవ రిచ్చారు ?”

“ఒకళ్లిచ్చే దేంటి తప్పుచేస్తే విరగ బొడవ టమే ”

“ఈమాత్రం దానికే అయితే జనంలో ఉన్న జేబుదొంగ లందరినీ ఏంచేస్తారు ?”

“వాళ్లు పట్టుబడితేనా నా యాళ్లని ఎము కల్లో సున్నం లేకుండా యిరగ్గొట్టనూ . అసలు యీడు మటుకు తక్కువ తిన్నాడూ, జేబు చూపించమంటే చూస్కో” అన్నాడు నేను ఉక్రోషం ఆపుకోలేక “అసలు నువ్వు దొంగవు కాదనెట్లా” అన్నాను అందరూ ఆశ్చర్యంగా చూశారు. ఆ క్షణంలో ఆ వ్యక్తి కళ్లల్లో కదిలిన కెంపులు చూసిన నేను భయంతో ఒక్క నిమిషం కంపించాను. మళ్లీ అందరి దృష్టి అతనిమీద పడింది. “ఈ సోదే కేం వచ్చె జేబులు వెదకండ్రా” అన్నా రెవరో. మొత్తాని కెట్లాగయితే యేం అతని జేబులోవి బయటికి లాగారు. ఒక పాత గుడ్డలో కనిపించిన పొట్లాన్ని విప్పారు. అందరూ ఆశ్చర్యపోయారు. తుప్పుబట్టి వంకర బోయిన మేకులు, అద్దం పెంకులు, గుండ్రటి గులక

లాళ్ళు, నున్నటి చిల్లపెంకులు, నాలు గయిదు బీడీ ముక్కలు, యిత్యాదు లన్నీ వెక్కిరిస్తున్నట్లు బయటపడ్డయ్. కొందరి ముఖాలు వెలవెలపోయినయ్.

"ఏం! యిప్పుడైనా తెలిసిందా? ఎంత గొప్ప దొంగని పట్టుకున్నారో?" ఆ మీసాల వస్తాదుని ఆక్షేపిస్తూ గుంపులో నుంచి ఒకాయన అన్నాడు.

"అంతా దొంగవేషాలు. వాటిని చూసి పిచ్చి వాడని వదలిపెడతారుగదాని ముందరే సిద్ధం చేసుకొన్నాడు. చూస్తారేం నలగ బొడవక. వెధవ వేషాలూ, వీడూను" అంటూ చెయ్యి చాపి అతని గూడమీద పొడిచాడు, వస్తాదు.

"బొడ్లోగాని ఎక్కడన్నా పర్సు ఉన్నయ్యేమో చూడండి" అని జనంలోంచి అన్నా రెవరో.

ఏడ్వటానికి కూడా శక్తి లేకపోవటంవల్ల అతని ఏడుపు ఆగిపోయింది. నోట్లోనుంచి, ముక్కు లోంచి రక్తం కారుతూనే ఉన్నది. కళ్ళు మూసుకు పోతున్నయ్. 'ఇవాళ ఎట్లాగూ వీళ్ల చేతులో చచ్చే ట్టున్నాడు' అనిపించింది.

"ఏయ్! నీకు చాతనయితే స్టేషనులో పప్ప గించు, లేకపోతే వదిలేసెయ్. అతన్ని కొట్ట టానికి వీల్లేదు" అన్నాను.

"ను వ్వెవరవయ్యా! తేపతేప పెద్ద దయుగలవా డల్లే వస్తావు. ఈ దొంగల సంగతి నీ కేం తెలుసు" అని వురిమాడు వస్తాదు. నేనేదో అందామను కుంటూండగా జనంలోనుంచి 'పర్సు ... పర్సు ... దొంగ దొంగ' అంటూ గోల గోలగా అరుస్తున్నా డొకాయన. కళ్లన్నీ ఆయన వైపు తిరిగినై. 'అయ్యో! డబ్బు!' అతను గాభరాగా చూస్తున్నాడు

'పట్టుకోండి' అనేవాళ్లేగాని దొంగెవరో ఎవ రికీ తెలియదు.

"ఎప్పుడు పోయిందండీ?" అడిగా డొక యువకుడు.

"ఏమోనండి గుంపులోకి వచ్చేటప్పుడు గూడా ఉన్నది. ఇప్పుడు చూసుకుంటే లేదు. దుగ్గిరాల వెళ్ళాలి వెళ్లటానికి కూడా ఛార్జీలు లేవు"

"ఎంత ఉండాలి"

"ముప్పయిఐదు రూపాయలు, ఛార్జీలు కూడా అందులోనే ఉన్నయ్."

ఎవరికి వారు ఏం చేయటానికి తోచక ఒకరి ముఖాలు ఒకరు చూసుకొంటున్నారు. 'అదిగో పోలీసు లొస్తున్నారు' అరిచా రెవరో. వస్తాదుతో సహా అందరూ అటు చూశారు. ఇద్దరు పోలీసులు లాఠీలు వూపుకుంటూ వస్తున్నారు.

ఇంతలో ఒక ముసలాయన ఒక పిల్లని ఎత్తుకొని వస్తున్నాడు. జనాన్ని తోసుకొంటూ లోపలికి వచ్చి పిల్లని కిందకి దించి పిచ్చివాడ్ని కౌగలించుకున్నాడు.

"ఇదేం ఖర్మరా నాయనా! ఆఖరికి అందరి చేత దెబ్బలు తినాల్సిన గత పట్టిందా! ఇంటి పట్టున తిని పడుండక ఎందు కొచ్చిందిరా .... అయ్యయ్యో .... రక్తం గూడా వస్తున్నదే ...." అని గుండెలు బాదుకుంటూ పైగుడ్డతో తుడిచి జనంవంక చూశాడు. "ఏం నాయనలారా! చల్లారిందా మీ కోపం. చంపేసేదాకా చల్లారదా. ఏం తప్పు చేశాడని. పిచ్చివా డనన్నా లేకుండా యిట్లా కొట్టారు .." ఆయన ఆవేశంగా అంటూంటే మధ్యలో "చిన్నపిల్ల చేతుల్లోది లాకెళ్లవచ్చా" అన్నా డొకతను.

"అవును తాతయ్యా! నేను కండె కొనుక్కొని తింటుంటే మామయ్య లాక్కుని పరుగెత్తాడు. నేను ఏడ్చాను. అప్పుడు వీళ్లందరూ మామయ్యను పట్టుకొని కొత్తూంటే భయమేసి నీ దగ్గరికి వచ్చా" అన్నది పాప పిచ్చివాడి వంక జాలిగా చూస్తూ.

మొక్కజొన్న కండెతోను, బటానీ గింజల తోను సరిపెట్టుకొని దెబ్బలుతినే దొంగలుంటారా? ఆమాత్రం ఆలోచలన లేకపోయే యీ జనానికి అనుకున్నా.

"అవునమ్మా అది వాళ్ల తప్పు కాదు వాళ్లకు చాతైంది చేశారు. అసలు దొంగల్ని పట్టుకోటం చాత కావద్దూ" అన్నాడు ముసలాయన. కొందరు తలలు వాల్చేశారు. అప్పుడే అక్కడకు వచ్చిన పోలీసులు "ఎవరి డబ్బండీ పోయింది" అన్నారు. ఆ ఆసామీ ముందు కొచ్చాడు.

'గుంపులోవాళ్లెవరైనా వెళ్లారేమో' అని సందేహించా డొక పోలీసు. అందరితోపాటు నేనూ నాల్గు వైపులా చూశాను. ఈ రంగంలో శ్రీరంగ నీతులు చెప్పిన వస్తాదు ఎప్పుడు మాయమైనాడో ఎవరికీ తెలియదు. అందరూ నోళ్లు తెరిచారు.

"విచారించకండి బాబుల్లారా ఎవరినైతే యేం తన్నటానికి. అసలు ఆకార్నాన్ని బట్టి దొంగని నిర్ణయించాలి" అన్నాడు ముసలాయన. ఆయన ఆవేదన గుర్తించి ఎవరూ మాట్లాడలేదు.

"రారా నాయనా! నీ కర్మ యిట్లా ఉన్నప్పుడు ఒకరి ననేం లాభం. పద అమ్మడూ" అని ముసలాయన పాప నెత్తుకున్నాడు. శక్తిలేక పటుత్వం తప్పిపోయి కూలిపోతున్న పిచ్చివాడిని ఒక చేత్తో పట్టుకొని మెల్లిగా నడిపించుకొంటూ పోతున్నాడు.

"ఈ పిచ్చివాడా నీ మామయ్య బంగారుపాపా!" అనుకున్నాను. ★

---

ఒంటికంటి కామాక్షి —
(ప్రక్కింటి మంగమ్మతో)
నీకంటే నేనే ఎక్కువగాచూడ గలను.

ప్ర. మంగమ్మ—అదెట్లా?

ఒం. కం. కా—క్షి: నా ముఖంలో ఒక కన్నే కను పిస్తూంది; మరి నేనో నీముఖం లో రెండు కళ్ళూ చూడ గలను.

టివ త్రిప్రసాదరావ్ (హైదరాబాద్)


సినిమానటులు

ఆదాయం పొందవలెనన్నచో వెంటనే మాకు వ్రాయండి. ఉచిత ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.
BOMBAY FILM SERVICE
(A.M.W.) PHAGWARA (N.R.)

RATNAM'S N-OIL
అంగనరములు బలహీనతి చెంది, చిన్న దినముల తిరిగి యథాప్రకారం అయి పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం|| ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కొవలసినవారు ముందుగా 1-4-0 పంపేది, ఇంగ్లులో స్పెషల్ రకం అర్జంటుగుణమునకు రూ. 25-0-0 లు.
డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904) గులక పేటబిల్డింగ్స్, ఆజంపురా గదిద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)


పెప్స్ లోక ప్రసిద్ధయిన గొంతు మరియు గుండె బిళ్లలతో రొమ్ము పడిశెము త్వరితంగా నివారించ బడినది
గొంతు నొప్పి, రొమ్ము పడిశెము దగ్గులు, జలుబులు, గొంతు మరియు గుండె బిళ్లలైన పెప్స్‌తో త్వరితంగా నివారణ యగును. పెప్స్‌ను చప్పరించి, నొప్పిని నివారించి క్రిములను నిర్మూలించే చర్యను జరుపునట్టి .. అందరికమనకర అవిరులను ఆస్వాదించండి.


పెప్స్ గొంతు మరియు గుండె బిళ్లలు
మందుల వ్యాపారు లందరి వద్దను దొరకును
సి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.
FPY-56-TEL
86, ...